

# అడుగుపడితే అపాయం

## - కొమ్మూరి సాంబశివరావు



### (గత సంచిక తరువాయి)

7

**తలమీద దేనితో** కొట్టాడోగాని పిడుగు పడినట్లయింది యుగంధర్‌కి. తల వేయి ముక్కలయినట్టు బాధ. గిరగిర బొంగరంలా తిరుగుతున్నట్లున్నది గది. స్పృహ పోయింది.

స్పృహ వచ్చేటప్పటికి మంచం మీద పడుకునున్నాడు. పైన సీలింగ్ ఫాన్ తిరుగుతోంది. గోడకున్న ఎలక్ట్రిక్ దీపం వెలుగుతోంది. నెమ్మదిగా తల పక్కకి తిప్పి గదంతా కలయ చూశాడు. మంచం పక్కన రెండు కుషన్ కుర్చీలు, ఒక బీరువా, ఒక బల్ల. దానిమీద అద్దం, దువ్వెన, పౌడర్, షేవింగ్ సెట్.

ఒకే ఒక కిటికీ వుంది. అడ్డంగా ఇనప వూచలు ఆ కిటికీకి. ఒకటే తలుపు మూసి వుంది.

తల పగిలిపోతోంది. తడిమి చూసుకున్నాడు యుగంధర్. తలమీద పెద్ద బొప్పె. అంతవరకు నయమే అనుకున్నాడు. నెమ్మదిగా లేచి కూర్చున్నాడు. కాళ్ళు విదిలించి లేచి నిలబడ్డాడు. దాహం వేస్తోంది. బల్లమీదవున్న కూజాలోంచి నీరు గ్లాసులో పోసుకుని తాగాడు. తనకి ప్రస్తుతం ప్రాణాపాయం లేదు. తనని హత్య చేయదలచుకుంటే ఇన్ని వసతులు ఏర్పాటు చేయరు. ఇంత దూరం తీసుకురారు. తన ఇంటిలోనే కాల్చి చంపేసి వెళ్ళిపోయేవాళ్ళు, తనని హత్య చేయాలనుకున్నవారు, ఆ ఆలోచన మానుకుని బందీగా ఎందుకు తీసుకొచ్చారు? లేక తనని హత్య చేయడానికి ప్రయత్నించినవాళ్ళూ తనని ఎత్తుకొచ్చినవాళ్ళూ వేరే వేరే ముఠాలోని వాళ్ళా?

తలుపు తెరిచి వుంటుందనుకోలేదు యుగంధర్. అయినా లాగి చూసి ఆశ్చర్యపోయాడు తెరుచుకునేటప్పటికి. అవతల వసారా, వసారాలో దీపాలు వెలుగుతున్నాయి. వసారాలోకి వెళ్ళి నిలుచుని జేబు తడుముకున్నాడు. సిగరెట్ జేబులోనే వుంది. సిగరెట్ వెలిగించి నాలుగడుగులు వేశాడు. ఓ తలుపు కనిపించింది. తోశాడు తెరచుకోలేదు. లోపల గడియపెట్టి వుంది. తట్టాడు.

"ఎవరు?" లోపల్నించి ప్రశ్న.

యుగంధర్ గొంతు గుర్తుపట్టాడు. గదిలో వున్న మనిషి భార్గవప్రసాద్ నేషనల్ డెయిలీ ఎడిటర్ అండ్ ప్రొప్రయిటర్.

రాజు వెళ్ళిపోగానే నళిని చటుక్కున లేచి నిలబడింది. గబగబ పడక గదిలోకి వెళ్ళి తల వెంట్రుకలు సరిచేసుకుని, హాండ్‌బాగ్ తీసుకుని, చెప్పులు వేసుకున్నది.

"ఎక్కడికి వెళుతున్నావు యింత రాత్రివేళ?" అడిగింది పార్వతి.

"చాలా అవసరమైన పని ఉన్నది. వెళ్ళాలి" గొణిగింది నళిని.

"నీకేమైనా మతిపోయిందా! ఇంత రాత్రివేళ ఎక్కడికి? ఈ ప్రాంతాలలో టాక్సీ కూడా దొరకదు కదా! ఒంటిగా వెళతావా? వీధిలో జనం లేరు, అదీకాక వాళ్ళు యీ ప్రాంతాల ఎక్కడయినా..."

"ప్లీజ్! ఊరుకో. నేను వెళ్ళి తీరాలి. చాలా ముఖ్యమైన పని."

"పోనీ, ఎక్కడికో చెప్పు."

"ఒద్దు, చెప్పడం మంచిది కాదు. నీకు తెలియకపోవడమే మంచిది" అని చరచర బయటికి వెళ్ళిపోయింది నళిని.

పార్వతి వీధి గుమ్మం దగ్గర నిలబడి చూసింది నళిని వీధి మలుపు తిరిగేటంత వరకూ. తరువాత వీధి తలుపు మూసి గడియపెట్టి, తిన్నగా టెలిఫోన్ దగ్గరికి వెళ్ళి ఓ నెంబరు తిప్పింది.

"హల్లో! పార్వతి స్పీకింగ్" అన్నది కనెక్షన్ రాగానే.

"హల్లో! ఏమిటి?"

"నళిని ఇప్పుడే బయటికి వెళ్ళింది."

"ఎక్కడికి?"

"నాకు చెప్పలేదు. నాకు తెలియకపోవడమే మంచిదన్నది."

"ఎందుకు వెళ్ళనిచ్చావు?"

"ఏం చెయ్యను? ఎలా ఆపను? ఇంత రాత్రివేళ వెళ్ళడం ప్రమాదమని చెప్పాను వినిపించుకోలేదు."

"కూడా తీసుకు వెళ్ళిందేమో?"

"లేదు. లేదని నిశ్చయంగా చెప్పగలను" అని నవ్వి,

"ఆఫీసు నుంచి వచ్చి చీర మార్చుకుంటున్నప్పుడు నేను అక్కడే వున్నాను, హాండ్‌బాగ్ తనిఖీ చేశాను. ఇంట్లో ఎక్కడా లేదు. అంతా వెతికాను."

"అయితే ఇంత రాత్రివేళ యెందుకు బయటికి వెళ్ళింది?"

"అదే అర్థం కాలేదు."

"సరే నువ్వు అక్కడే వుండు అవసరమైనపుడు మళ్ళీ ఫోన్ చెయ్యి."

"ఇంకో విషయం" అన్నది పార్వతి.

"ఏమిటి?"

"ఎవరో యిద్దరు ఇంట్లో జొరబడి నన్నూ, నళినినీ బంధించి యిల్లంతా గాలించారు. వాళ్ళు వెళ్ళిపోయిన కాసేపటికి డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంటు రాజు వచ్చి, మమ్మల్ని విడిపించారు. యుగంధర్ ఏదో ఆపదలో వున్నాడని తెలిసి వెంటనే వెళ్ళిపోయాడు."

"వాళ్ళకింకా దొరకలేదన్నమాట. అంతవరకు నయమే. ఏమైనా విశేషాలు జరిగితే వెంటనే ఫోన్ చెయ్యి" అని అవతల మనిషి రిసీవర్ పెట్టేశాడు.

పార్వతి పక్కమీద దుప్పటి దులుపుకుని పడుకున్నది.

నళిని చకచక నడుస్తోంది. రాత్రి పదిగంటలు దాటింది. వీధిలో జనం లేరు. ఎప్పుడో ఒక మోటారు కారో, సైకిలో వెళుతోంది. భార్గవప్రసాద్ ఇంట్లో లేరు. తన యింటికీ రాలేదు. ఏడుగంటలకల్లా వస్తానని భార్యతో చెప్పాడు. తనకి ఫోన్ చేసి చెప్పలేదు, తన యింటికి ఎప్పుడు వస్తున్నదీ. ఏదయినా అపాయంలోవున్నాడా? అపాయంలో యిరుక్కుని వుంటే తన వల్లే అది జరిగి వుంటుంది. 'ఒద్దు. మనకెందుకు' అన్నాడు. పాపం, తనే ప్రోత్సహించింది. ఇప్పుడు భార్గవ ప్రసాద్‌కి సహాయపడవలసిన బాధ్యత తనమీద వున్నది.

ఖాళీ టాక్సీ కనపడుతుందేమోనని వచ్చే ప్రతికారునీ ఆశగా చూస్తోంది ఆమె. వీధి మలుపు తిరిగి ఆగింది. బస్ స్టాప్ దగ్గర బస్సులు నిలిచిపోయి వుంటాయి. టాక్సీయే దొరకాలి అనుకున్నది.

అయిదు నిముషాలు గడిచిపోయాయి, ఓ కారు వచ్చి ఆమె ముందు ఆగింది. "హల్లో మిస్ నళిని" అన్నాడు కారులోంచి ఎవరో.

"హల్లో తమరెవరు?" అడిగింది డ్రైవింగ్ సీటులో కూర్చున్న అతన్ని. ఆ కారులో యింకెవరూ లేరు.

"భార్గవ ప్రసాద్ స్నేహితుణ్ణి. మిమ్మల్ని చాలాసార్లు చూశాను."

"అలాగా!"

"నేను మీ ఇంటికే వస్తున్నాను."

"ఎందుకు?"

"మిమ్మల్ని తీసుకు వెళ్ళడానికి."

"ఎక్కడికి?"

"భార్గవప్రసాద్ దగ్గరికి."

"ఆయన ఎక్కడ వున్నారు?

"చెప్పడానికి వీల్లేదు. చెప్పవద్దన్నారు. మిమ్మల్ని తీసుకు రమ్మని చెప్పారు."

"ఆయన నన్ను పిలుచుకు రమ్మన్నారని నిదర్శనమేమైనా చూపగలరా?" అడిగింది నళిని.

"ఉత్తరం రాసి యివ్వడానికి వ్యవధి లేకపోయింది. దీన్ని చూపించమన్నారు" అంటూ ఒక వస్తువు ఆమె కిచ్చాడు.

అది ఉంగరం. భార్గవ ప్రసాద్‌కి తను ఇచ్చిన ఉంగరం. నిమిషం పాటు ఆలోచించింది. తనని పిలుచుకు రమ్మని భార్గవప్రసాద్ ఆ ఉంగరం యిచ్చి వుండకపోవచ్చు. భార్గవప్రసాద్‌ని బంధించి, ఉంగరంలాక్కుని వుండవచ్చు. ఏదైనా భార్గవ ప్రసాద్ ఇతని యింట్లోనో, ఇతని అధీనంలోనో వున్నాడు. తననీ అక్కడికి తీసుకు వెళ్ళి బంధిస్తాడేమో? బంధిస్తే బంధించనీ, అక్కడికి వెళ్ళి తీరాలి అనుకుని "సరే పదండి" అని కారెక్కి అతని ప్రక్కన కూర్చున్నది ఆమె.

కారు కొంచెం దూరం వెళ్ళిన తర్వాత రోడ్ ప్రక్కగా ఓ చోట ఆగాడు అతను.

"ఇక్కడ యెందుకు ఆపారు?" అడిగింది ఆమె కాస్త కంగారుగా.

"లైట్సు స్విచ్ సరిగాలేదు. చూడాలి" అంటూ అతను ముందుకి ఒంగాడు. అతని చేతిలో ఏదో వున్నది.

నళిని వెనక్కి ఆనుకున్నది. అతని చేతిలోంచి వాన జల్లులా మొహం మీద ఏదో పడింది. నిమిషంలో నళినికి స్పృహపోయింది.

8

"లేదు ఎటువంటి సూచనాలేదు. ఉంటే ఆ దుర్మార్గుల్ని తరుముకుంటూ వెళ్ళేవాడిని" అన్నాడు రాజు.

అది పోలీస్ కమీషనర్ ఆఫీసు. అసిస్టెంట్ కమీషనర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు కూడా వున్నారు ఆ గదిలో.

"యుగంధర్‌గారిని ఎత్తుకుపోయారనా మీ అనుమానం" అడిగాడు కమీషనర్.

రాజు తలవూపి "యుగంధర్‌గారు వాళ్ళని తరుముకుంటూ వెళ్ళి వుంటే నేను ఆదుర్దా పడకుండా ఏదో ఒక గుర్తు పెట్టేవారు. తను ఆపదలో వున్నానని ఫోనులో చెప్పారు. నేను వెళ్ళేటప్పటికి లేరు. తలుపులన్నీ బార్లా తెరిచి వున్నాయి. ఇనపపెట్టె తలుపూ బల్ల సొరుగులూ తెరిచి వున్నాయి" అన్నాడు.

పోలీస్ కమీషనర్ కాసేపు ఆలోచించి "నేను ఇలా అడుగుతున్నందుకు బాధపడకండి. యుగంధర్‌గారిని హత్య చెయ్యడానికి యింతకు ముందు ప్రయత్నించారు. అదృష్టవశాత్తు అప్పుడు వాళ్ళ ప్రయత్నం ఫలించలేదు. హత్య చెయ్యదలచుకున్న వాళ్ళు ఆయన్ని ఎత్తుకుపోయి ఇంకా ప్రాణాలతో వుంచుతారా" అడిగాడు.

రాజు నిట్టూర్చి "అవును. నాకూ అదే భయం వేసింది. యుగంధర్‌ని హత్య చెయ్యడమే వాళ్ళ ఉద్దేశ్యం అయితే ఎత్తుకుపోవలసిన అవసరం యేముంది. అప్పటికప్పుడే చంపి వుండవచ్చుగా" అన్నాడు.

"దటీజ్ ఎ గుడ్ పాయింట్. యుగంధర్‌ని వాళ్ళు బందీ చేశారనే మనం అనుకుందాం. అసలు యీ గొడవ ఫిరోజ్ అనే అతనితో ప్రారంభం అయింది. ఫిరోజ్ యీ వూరికి రాగానే నేషనల్ డెయిలీలో ఎడిటర్ భార్గవప్రసాద్‌ని కలుసుకునేందుకు ప్రయత్నించాడు. కనుక భార్గవప్రసాద్‌కి యీ గొడవతో ఏదో సంబంధం వుండి వుండాలి. లేకపోతే ఫిరోజ్ మరణించిన రోజు రాత్రంతా యింట్లోనే వున్నానని మీతో అబద్ధం ఎందుకు చెపుతాడు? భార్గవ ప్రసాద్‌ని పిలిపించి అడుగుదాం" అన్నాడు కమీషనర్.

"భార్గవప్రసాద్ కూడా మాయమయ్యాడు" చెప్పాడు రాజు.

"మాయమయ్యాడా? ఎలా?"

"ఎలా మాయమయ్యాడో నాకు తెలియదు. నిన్న సాయంకాలం ఏడు గంటల ప్రాంతాల ఆఫీసునించి బయలుదేరాడు తన కారులో. రోజూ ఆఫీసునించి ఆయన సెక్రటరీ నళిని యింటికి వెళతాడట. నలుగురికీ తెలియకుండా వుండేందుకు వీధి చివర్న కారు ఆపి, మిగతా కాస్త దూరం నడుస్తాడట. డ్రయివర్ కారుని ఆఫీసుకి ఫోను చేసి డ్రైవర్‌కి చెపుతాడు. భార్గవప్రసాద్ నిన్న సాయంకాలం ఏడుగంటల ప్రాంతంలో యింటి వీధి చివర కారు దిగాడు. డ్రైవర్ కారు తీసుకు వెళ్ళిపోయాడు. భార్గవప్రసాద్ ఆమె యింటికి వెళ్ళలేదు. కారు తీసుకు రమ్మని డ్రైవర్‌కి ఫోన్ చెయ్యలేదు. వీధి చివర్న కారు దిగిన మనిషి ఎవరితో ఎక్కడికి వెళ్ళాడో తెలియదు" చెప్పాడు రాజు.

కమీషనర్ సిగరెట్ వెలిగించి "చాలా కాంప్లికేటెడ్‌గా వుంది. ఆ నళినికి ఏమన్నా తెలుసేమో? తెలిసే వుంటుంది. ఆమెని పిలిపిద్దామా?" అన్నాడు.

రాజు పెదిమ విరిచి, "సారీ ఆమె కూడా మాయమయింది. నిన్న రాత్రి పదిగంటలప్పుడు యింట్లోంచి బయలుదేరిందట" అన్నాడు.

"బావుంది. ఈ కేసుకి సంబంధించిన వాళ్ళెవరయినా ఉన్నారా? అందరూ అదృశ్యమైనారా?"

"నేను ఒక్కడ్నే వున్నాను. మిగతా వాళ్ళందరూ అదృశ్యమైనారు."

"మిగతా వాళ్ళంతా అంటే ఎవరెవరు?"

"మిసెస్ భార్గవప్రసాద్, ఆమె పేరు లక్ష్మి. రాత్రి అన్నం తినకుండా గ్లాసు పాలు తాగి పడుకుందట. తెల్లారి చూస్తే ఎక్కడా లేదట. రాత్రి ఎవరూ రాలేదని గూర్కా జవాను చెబుతున్నాడు. నౌకర్లు కూడా యేమీ చెప్పలేకపోయారు."

కమీషనర్ సిగరెట్ ఆష్‌ట్రేలో పడేసి "యింకా ఎవరు మాయమయ్యారు?" అడిగాడు.

"సత్యనారాయణ."

"ఎవరతను?"

"నేషనల్ డెయిలీలో న్యూస్‌లో న్యూస్ ఎడిటర్."

"ఈ కేసుతో అతనికేమిటి సంబంధం?"

"ఫిరోజ్ తనతో టెలిఫోనులో మాట్లాడి, ఏదో సెన్సేషనల్ న్యూస్ చెపుతానన్నప్పుడు న్యూస్ ఎడిటర్ సత్యనారాయణని కల్సుకోమని భార్గవప్రసాద్ చెప్పాడట. ఈ విషయం ఆయనే చెప్పాడు."

"ఫిరోజ్ సత్యనారాయణని కల్సుకున్నాడా?"

"లేదన్నాడు సత్యనారాయణ."

"అతనెప్పుడు, ఎలా మయమయ్యాడు?"

"నిన్న సాయంకాలం ఆఫీసునుండి ఇంటికి బయలుదేరాడట. ఇంటికి వెళ్ళలేదు. ఏమయ్యాడో, ఎలా మాయమయ్యాడో తెలియదు" అన్నాడు రాజు.

"ఇంతమందిని ఎత్తుకుపోయి దాచేసిన వాళ్ళు నిన్ను ఎత్తుకుపోవడానికి ఎందుకు ప్రయత్నించలేదో" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అదే నాకూ అర్థం కాలేదు."

"మిస్టర్ రాజూ! ఇప్పుడేం చేద్దామంటారు?" అడిగాడు కమీషనర్.

"ఎంత జాగ్రత్తగా పథకం వేసి వీళ్ళనందరినీ ఎత్తుకుపోయినా ఏవో కొన్ని సూచనలు ఉండిపోయాయి. ఎలా ఎత్తుకుపోయినదీ, ఎవరిని ఎప్పుడు ఎత్తుకుపోయినదీ నేను ఒక్కణ్ణీ దర్యాప్తు చేయడం మంచిదికాదు. అందుకే ఇక్కడికి వచ్చాను. మీ డిపార్ట్‌మెంటు దర్యాప్తు చేయడం మంచిది."

"దటీజ్ ఆల్‌రైట్. ఇన్‌స్పెక్టర్. మీరు దర్యాప్తు చెయ్యండి" అని రాజు వేపు తిరిగాడు కమీషనర్.

"రొటీన్ ఇన్వెస్టిగేషన్ మీ డిపార్ట్‌మెంట్ చేస్తూ వుంటే నేను నా దర్యాప్తు సాగిస్తాను" అన్నాడు రాజు.

## 9

యుగంధర్ని ఆశ్చర్యంతో చూశాడు భార్గవ.

"నేను మీ అతిధినా?" అడిగాడు యుగంధర్.

"అదే ప్రశ్న మిమ్మల్ని నేను అడుగుదామనుకుంటున్నాను" అన్నాడు భార్గవప్రసాద్.

"అయితే ఇది ఎవరి ఇల్లో మీకు తెలియదా?"

"తెలియదు. మీకు తెలుసా?"

యుగంధర్ పెదిమ విరిచాడు. "మీరు ఇక్కడికి ఎప్పుడొచ్చారు" అడిగాడు.

"నిన్నరాత్రి అయుండాలి. మీరు?"

"తరవాత చెపుతాను. మీరెలా వచ్చారు?"

"ఏడుగంటల ప్రాంతంలో ఆఫీసునించి యింటికి బయలుదేరాను. అయాం సారీ! నా సెక్రటరి నళిని ఇంటికి బయలుదేరాను. వీధి మలుపులో కారు దిగి ముందుకి నాలుగడుగులు వేశానో లేదో నా వెనక ఎవరో వీపుమీద పిస్తోలు ఆనించి 'చెప్పినట్లు చెయ్యి లేదా కాచిపారేస్తాను ' అని బెదిరించారు."

"తరువాత?"

నేను అరిచి గొడవ చేస్తే ఏమవుతుందని క్షణం ఆలోచించాను. నడివీధిలో నన్ను కాల్చి తను పట్టుబడతాడా? ఏమో? ఫిరోజ్‌ని చంపారు. ఎవరూ పట్టుబడలేదు. తను పట్టుబడతానేమోనన్న భయంతో నన్ను చంపరని ఎలా అనుకోవడం? సాహసం చెయ్యడం వివేకం కాదనిపించింది. అతను వచ్చిన కారు అక్కడే వుంది. ఎక్కమన్నాడు. ఎక్కాను. ఇంకోడు వున్నాడు కార్లో. కారు బయలుదేరిన అయిదు నిమిషాలకి నా మొహం మీద మత్తు మందు చల్లారు. తరవాత ఏం జరిగిందో తెలియదు. ఇప్పుడే పావుగంట క్రితం స్పృహ వచ్చింది" చెప్పాడు భార్గవప్రసాద్.

యుగంధర్ గదంతా పరీక్ష చేశాడు. ఓ కిటికీ వుంది. కిటికీ దగ్గరకెళ్ళి బయటికి చూశాడు. దూరాన దాదాపు ఫర్లాంగు దూరంలో రోడ్ కనిపించింది. లారీలు వెళుతున్నాయి రోడ్‌మీద. ఎద్దుబళ్ళు కూడా వెళుతున్నాయి. పట్నానికి బాగా దూరంగా వున్న చోటు అయుండాలి అనుకున్నాడు.

ఇంటి చుట్టూ విశాలమైన ఆవరణ. చెట్లు, క్రొటన్స్, కళకళలాడుతోంది తోట. ఒకటి, రెండు, మూడు, పన్నెండు కుక్కలు. అన్నీ అల్సేషియన్లు తిరుగుతున్నాయి తోటలో. ఎవరయినా ఇంటిలోంచి తప్పించుకున్నా తోటలో అడుగు పెట్టగానే కుక్కలు మీదపడి చీల్చిపారేస్తాయి.

యుగంధర్ తలవూపి, "రండి ఇల్లంతా చూద్దాం" అంటూ నడవాలో కెళ్ళాడు. నడవా చివర్న ఒకవేపు కిదికి మెట్లు, ఇంకోవేపు పైకి మెట్లు కనిపించాయి.

అది డాబా మీదికెళ్ళే మెట్లగది. వేరే గదిలేదు. విశాలమైన డాబా. యుగంధర్ చుట్టూ చూసి "చాలా పెద్ద యిల్లు. మీరూ, నేనూ విడిగా ఎవరికీ వినిపించకుండా మాట్లాడుకునేందుకు మళ్ళీ అవకాశం కలుగుతుందో లేదో, ఇంతకు

ముందు మనం కలుసుకున్నప్పుడు మీరు నిజం చెప్పలేదు నాకు. ఇప్పుడు నిజంగా ఏం జరిగిందో అంతా చెపుతరా" అడిగాడు.

భార్గవప్రసాద్ ముఖం ఇబ్బందిగా పెట్టి "అవును, అప్పుడే మీకు నిజం చెప్పి వుండవలసింది. తప్పు చేశాను" అని చెప్పడం ప్రారంభించాడు.

"నేషనల్ డెయిలీలో న్యూస్ పత్రికకి విదేశాల ముఖ్య నగరాల్లో ప్రత్యేక ప్రతినిధులున్నారు. ఆరునెలల క్రితం ఫిరోజ్ స్విట్జర్లాండుకి ఒక ప్రతినిధి వర్గంలో సభ్యుడిగా చైనానుండి వెళ్ళాడు. స్విట్జర్లాండుక్‌లో వున్న మా ప్రతినిధి ఫిరోజ్‌ని కలుసుకోవడం జరిగింది. 1962 సంవత్సరంలో చైనా భారతదేశం మీద దాడి చేయడం చాలా అక్రమమయిన పని అనీ, ఒక మిత్రదేశాన్ని చేజేతులా పోగొట్టుకోవడం చాలా అవివేకమైన పని అని తన నమ్మకమనీ ఫిరోజ్ అతనికి చెప్పాడు. చైనా రాజకీయ వ్యవస్థ ఫిరోజ్‌కి ఇష్టంలేదని మాటల సందర్భంలో మా ప్రతినిధి గ్రహించాడు. అంతేగాక ఫిరోజ్ పేరుకి కల్చరల్ మినిస్టిరీలో వున్నా నిజానికి అతను అణుశక్తి పరిశోధనా కేంద్రంలో ఉద్యోగం చేస్తున్నాడనీ, పాశ్చాత్య దేశాలు అణుశక్తి పరిశోధనా కేంద్రంలో ఉద్యోగం చేస్తున్నాడనీ, ఒపాశ్చాత్య దేశాలు అణుశక్తి పరిశోధనలో సాగిస్తున్న కృషిని గురించి తెలుసుకునేందుకే ఫిరోజ్‌ని విదేశాలకి చైనా పంపుతున్నదనీ గ్రహించాడు మా ప్రతినిధి. ఎన్నడయినా భారతదేశం వెళ్ళడం సంభవిస్తే తమ పత్రిక ప్రొప్రయిటరు, సంపాదకుడు అయిన నన్ను కలుసుకోమని చెప్పి నా ప్రయివేట్ టెలిఫోన్ నెంబర్ యిచ్చాడు. ఈ విషయాలన్నీ నాకు మా పత్రికా ప్రతినిధి తెలియజేశాడు. ఇది పూర్వకథ."

"తరువాత?" అడిగాడు యుగంధర్.

(కొనసాగింపు వచ్చేనెలలో)

Post your comments